## జిల్లాలో భారీగా పోలీస్ సిబ్బంది బదిలీ

**91 మందికి స్థాన చలనం**

వినాయక్‌నగర్, అక్టోబర్ 14: జిల్లాలో పెద్దసంఖ్యలో పోలీసు సిబ్బందిని బదిలీ చేశారు. ఈ మేరకు సీపీ కల్మేశ్వర్ సింగేన వార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని ఉన్న పోలీసు స్టేషన్లతోపాటు టాస్క్‌ఫోర్స్ విభాగంలో పని చేస్తున్న మొత్తం 91 మంది సివిల్ పోలీస్ సిబ్బందికి స్థాన చలనం కల్పించారు. బదిలీ అయిన వారిలో ఏఎస్సైలు ఆరుగురు, హెడ్ కానిస్టేబుళ్లు 12 మంది, కానిస్టేబుళ్లు73 మంది ఉన్నారు. వీరు తమను బదిలీ చేసిన సంబంధిత పోలీస్ స్టేషన్లలో వెంటనే రిపోర్ట్ చేయాలని సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫర్ అయిన సిబ్బందిని వెంటనే రిలీవ్ చేయాలని సంబంధిత ఎస్‌హెచ్‌వోలు, సీఐలతోపాటు ఇతర అధికారులకు సూచించారు.

## వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర

సుభాష్‌నగర్, అక్టోబర్ 14: జిల్లాకేంద్రంలోని కోటగల్లీ శ్రీ భక్త మార్కండేయ దుర్గామాత శోభాయాత్ర సోమవారం వైభవంగా కొనసాగింది. నగర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్రలో వీరహనుమాన్, రామలక్ష్మణ రథం, పుణె డోల్, కేరళ వాయిద్యం, పంజాబీ డోల్, కర్రసాము, బోనాల కోలాటం, గుస్సాడీ, ఒగ్గు, డోలు, చిందు కళాకారులు, డప్పు వాయిద్యాలు, పోతరాజులు, గంగిరెద్దులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, చూపరులను ఆకట్టుకున్నాయి. కోటగల్లీ నుంచి ఆరంభమైన శోభాయాత్ర ఆర్‌ఆర్ చౌరస్తా మీదుగా బాసరలో నిమజ్జనం చేయడానికి తరలించారు.



## 17న ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలు

కంఠేశ్వర్, అక్టోబర్ 14 : నందిపేట్‌లోని గీతా కాన్వెంట్ పాఠశాలలో ఈనెల 17న ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ఖోఖో ఒక రోజు జిల్లా స్థాయి జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూమారెడ్డి, అతీఖుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఒరిజినల్ బోనాఫైడ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టుసైజ్ ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్ల వివరాలు 16న సాయంత్రం 5 గంటలలోగా నిజామాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి నాగేశ్వర్‌రావు 8555996271, 7396541233, 9494259901 నంబర్లకు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు.

















